

విరుదునగర్ జిల్లాలో ఘోర ప్రమాదం

రాళ్ల క్వారీలో పేలుడు ● నలుగురు మృతి

● 12 మందికి గాయాలు



సీసీ కెమెరాలో రికార్డయిన పేలుడు దృశ్యం

పెరంబూర్, మే 1: విరుదునగర్ జిల్లాలోని రాళ్ల క్వారీలో ఘోర ప్రమాదం సంభవించింది. గోడౌన్‌లోని పేలుడు పదార్థాలు హఠాత్తుగా పేలడంతో నలుగురు కార్మికులు దుర్మరణం చెందగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి క్వారీ చుట్టుపక్కల ప్రాంతాల్లోని భవనాల కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. పలు గోడలకు నెర్రెలు ఏర్పడ్డాయి. బుధవారం ఉదయం ఆవియూర్-కీళ ఉప్పిలిలో ఉన్న రాళ్ల క్వారీలో ఈ ఘటన సంభవించింది. వివరాలిలా వున్నాయి... గ్రానైట్ క్వారీలో రాళ్లను బద్దలు కొట్టేందుకు పేలుడు పదార్థాలు వినియోగిస్తుంటారు. ఇందు కోసం ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన పేలుడు పదార్థాలను ఓ గదిలో భద్రపరిచారు. అయితే బుధవారం ఉదయం హఠాత్తుగా భారీ శబ్దంతో ఆ గది పేలిపోయింది. మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఈ సమయంలో అక్కడున్న నలుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ఆ ప్రాంతంలోని రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఘటనా స్థలంలో మరికొన్ని పేలుడు పదార్థాలు కూడా వుండడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సాయంత్రం వరకు ఘటనా స్థలికి వెళ్ల లేకపోయారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల సుమారు 2 కి.మీ దూరం వరకు ఇళ్ల గోడలు బీటలు వారాయి. ఈ ఘటనలో కందస్వామి (47), దురై (25), గురుస్వామి (60) సహా నలుగురు మృతిచెందారు. మరో 12 మంది గాయపడ్డారు. అలాగే, క్వారీలో మరి కొందరు కార్మికులు చిక్కుకున్న నేపథ్యంలో, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. క్వారీలో పేలుడు సంభవించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. కాగా, ఈ క్వారీని మూసివేయాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని ఆరోపిస్తూ, గ్రామస్తులు రాస్తారోకో చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది.

సమీపంలో 1,200 కిలోల పేలుడు పదార్థాలతో వ్యాన్...

పేలుడు ఘటన సంభవించిన వందమీటర్ల దూరంలో 1,200 కిలోల పేలుడు పదార్థాలతో వ్యాన్ ఉంది. ఒకవేళ ఈ పేలుడు మంటలు ఆ వ్యాన్‌కు అంటుకుంటే విపత్తు భారీ స్థాయిలో ఉండేది. క్వారీలో రాళ్లు బద్దలు కొట్టేందుకు ఈ వ్యాన్‌లో పేలుడు పదార్థాలు తీసుకొచ్చారు. వ్యాన్ సమీపంలోని గదిలో అప్పటికే ఉంచిన పేలుడు పదార్థాలు ఊహించని విధంగా పేలాయి. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న అగ్నిమాపక, పోలీసుల సిబ్బంది పరిశీలించగా, పేలుడు జరిగిన ప్రాంతం సమీపంలో పేలుడు పదార్థాలతో వ్యాన్ ఉన్నట్లు గుర్తించారు. వాటిని పేలకుండా చేయడం, భద్రతగా అక్కడి నుంచి వ్యాన్‌ను తీసుకొచ్చేందుకు ఉన్నతాధికారులు సమాలోచనలు జరుపుతున్నారు. కాగా, ఘటన కారణమైన క్వారీ యజమాని, సూపర్‌వైజర్ పరారీలో ఉండడంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సత్యమంగళం వద్ద రెండు కార్ల ఢీ

● ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం
● మరో నలుగురికి తీవ్ర గాయాలు





మృతుడు మురుగన్ (ఫైల్ ఫొటో)

ప్రమాదానికి గురైన కారు

పెరంబూర్, మే 1: ఈరోడ్డు జిల్లా సత్యమంగళం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడి మృత్యువుతో పోరాడుతున్నారు. వివరాలిలా వున్నాయి... కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం సమీపం సిరుముగై జడయంపాళయం ప్రాంతానికి చెందిన మురుగన్ (35)- రంజిత (30) దంపతులకు కుమారుడు అభిషేక్ (8), కుమార్తె నితిషా (7) ఉన్నారు. మురుగన్ కుటుంబంతో కలసి కరూర్ వెళ్లి తిరిగి మంగళవారం రాత్రి సిరుముగైకు ప్రయాణమయ్యారు. బుధవారం వేకువజామున సత్యమంగళం-మేట్టుపాళయం రోడ్డు చేనేత కాలనీ సమీపంలో మురుగన్ కారు.. ఎదురుగా వచ్చిన మరో కారును వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో మురుగన్, రంజిత, అభిషేక్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. నితిషా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మరో కారులో వున్న విద్యార్థులు చెన్నై అన్నానగర్‌కు చెందిన మోహన్ (21), సేలంకు చెందిన సుజిత్ (21), తిరుప్పూర్‌కు చెందిన విశాల్ బద్రి (21), కారు డ్రైవర్ అక్షర (21) తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేర్పించగా, వారి పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై భవానీసాగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

భారీ వ్యయంతో 'బ్రాడ్‌వే' బస్ టెర్మినల్



బ్రాడ్వే బస్టాండు

● రూ.823 కోట్లతో 9 వాణిజ్య కాంప్లెక్స్‌లు 3 వేల బస్సులు నిలిచేలా నిర్మాణం
● త్వరలో ఖాదీ క్రాఫ్ట్ భవనం కూల్చివేత
● జూలైలో ఐలాండ్ గ్రౌండ్ నుంచి సిటీ బస్సులు

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ నుంచి చెన్నైగా మారిన నగర పరిణామంలో ప్రధానమైన బ్రాడ్వే బస్టాండు ప్రాంతం కొత్త రూపు సంతరించుకోనుంది. సుమారు వందేళ్లుగా బ్రాడ్వే బస్టాండు నుంచే అన్ని నగరాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, సిటీ బస్సులు నడుపుతున్నారు. ఓ వైపు కొత్వాల్‌చావిడి కూరగాయల మార్కెట్, మరో వైపు వందల సంఖ్యలో తిరిగే బస్సులతో పగలూ రాత్రి సందడిగా ఉండే బ్రాడ్వే బస్టాండు నగరానికి కీలక ప్రాంతాతంగా ఉండేది. బ్రాడ్వే బస్టాండు, కొత్వాల్‌చావిడి మార్కెట్ వల్ల మన్నడి ప్రాంతం, ఎన్ఎస్‌సీ రోడ్డు, మింట్ స్ట్రీట్, హైకోర్టు ప్రాంతం నిత్యం జనంతో రద్దీగా ఉండేవి. ఈ రద్దీకి తోడు కాయగూరలు తీసుకెళ్లేందుకు వందల సంఖ్యలో వచ్చే వ్యాన్లు, లారీలు కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించేవి. ఈ పరిస్థితుల్లో ముందుగా కొత్వాల్‌చావిడి మార్కెట్‌ను కోయంబేడుకు తరలించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు నడిచే బేసిన్ బ్రిడ్జికి మంగళం పాడారు. బ్రాడ్వే నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కోసం ప్రత్యేకంగా కోయంబేడు వద్ద బస్‌స్టేషన్ నిర్మించారు. ప్రస్తుతం నగరంలో ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసుల సంచారాన్ని నిషేధించేలా మాధవరం బస్‌స్టేషన్, కిలాంబాక్కం బస్‌టెర్మినల్ కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో బ్రాడ్వే బస్టాండు ప్రాంతాన్ని పూర్తిగా సిటీ (ఎంటీసీ) బస్సుల రాకపోకలకే ఉపయోగిస్తున్నారు. ఈ బస్టాండును పునర్నిర్మించేందుకు పలు ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ బస్టాండుకు వచ్చే బస్సులను నిలిపేందుకు అనువైన ప్రత్యామ్నాయ స్థలం లేకపోవడంతో ఆ ప్రయత్నాలు మానుకున్నారు. ప్రస్తుతం బ్రాడ్వే బస్టాండు నుంచి సుమారు రెండు వందల సిటీ బస్సులను నగరమంతా నడుపుతున్నారు. ఈ కారణంగా ఈ బస్టాండులో సిటీ బస్సుల రాకపోకలు సవ్యంగా సాగటం లేదు. దీనికి తోడు సిటీ బస్సులు నిలిచేందుకు స్థలం కొరత ఉంది. ఈ పరిస్థితుల్లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు బ్రాడ్వే బస్టాండుకు వచ్చే బస్సులు నిలిపేందుకు ప్రతియేటా ఎగ్జిబిషన్ నిర్వహించే ఐల్యాండ్ గ్రౌండ్ అనువుగా ఉంటుందని భావించారు. అనుకున్నదే తడవుగా రూ.5 కోట్లతో ఐలాండ్ గ్రౌండ్‌లో ప్రత్యామ్నాయ బస్టాండు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం బ్రాడ్వే బస్టాండు నిర్మాణం కోసం రూ.823కోట్ల మేర నిధులు విడుదల చేసింది. ప్రస్తుతం బస్టాండు ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వానికి చెందిన భవనాలను కూల్చివేసి మరింత స్థలాన్ని సేకరించే చర్యలు ప్రారంభించారు. బ్రాడ్వే బస్టాండు ప్రవేశద్వారం వద్దనున్న ఖాదీ క్రాఫ్ట్ భవన సముదాయాన్ని త్వరలో కూల్చివేయనున్నారు. బస్టాండులోపల మూడు వైపులా ఉన్న ప్లాట్‌ఫామ్‌లను, దుకాణాలను కూడా కూల్చివేస్తారు. ఇక కొత్తగా నిర్మించే బస్ టెర్మినల్ ప్రాంతం నుంచి సబర్బన్ రైల్వే స్టేషన్, మెట్రోరైల్వేస్టేషన్‌కు సులువుగా వెళ్లేందుకు వీలుగా ఏడు కాలిబాట ఫ్లైఓవర్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులు ప్రారంభానికి ముందు జూలైలో ఐలాండ్ గ్రౌండ్‌లో ప్రత్యామ్నాయ బస్టాండు ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి బ్రాడ్వే బస్ టెర్మినల్ నిర్మాణ పనులు పూర్తయేంతవరకూ ఐలాండ్ గ్రౌండ్ నుండే నగరంలోని నలువైపులా సిటీ బస్సులను నడుపనున్నారు. ప్రస్తుతం బ్రాడ్వే బస్ టెర్మినల్ నిర్మాణం కోసం విడుదల చేసిన టెండర్‌లోని వివరాల ప్రకారం రోజుకు లక్షమంది ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండే సంచరించేలా ఈ బస్‌టెర్మినల్ నిర్మిస్తారు. ప్రతిరోజూ 75 రూట్లలో 3 వేల సిటీ బస్సులు ఈ బస్ టెర్మినల్ నుంచి వెళ్లేందుకు అనువుగా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించనున్నారు.

స్తంభించిపోయిన సాధారణ సేవలు

● ఈసీపై మంత్రి సుబ్రమణ్యం ఆగ్రహం



చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగిస్తుండటం వల్ల ప్రజా ప్రతినిధులు ప్రజలకు సాధారణ సేవలు కూడా చేయలేక పోతున్నారని, ఎన్నికల కోడ్‌ను నలభై రోజులకు పైగా కొనసాగించడం గర్హనీయమని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాపేట నియోజకవర్గంలో కలైంజర్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులకు ఆంగ్ల బోధనా తరగతులను బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనల వలన మంత్రులు కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో తన సొంత ఖర్చులో ఏర్పాటైన సంస్థలో ఉచిత ఆంగ్ల బోధనా తరగతులను ప్రారంభించడానికి కూడా కార్పొరేషన్, పోలీసుశాఖ అనుమతులు తీసుకున్న తర్వాత ఎన్నికల సంఘం ఆమోదాన్ని కూడా పొందాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎండలు అధికంగా ఉండటంతో పార్టీ తరఫున చలివేంద్రాలను ఏర్పాటుచేయడానికి కూడా ఎన్నికల సంఘం అనుమతి కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని చోట్ల రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను తొలగించడం సబబేనా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తాము ప్రాతినిధ్యం వహించే ప్రాంతాల్లో మురుగు కాల్వలు పూడుకుపోయినా వాటిని తొలగించేందుకు వారం, పదిరోజులు అనుమతి కోసం వేచి చూడాల్సి ఉందన్నారు. గతంలో కౌన్సిలర్లు అధికారులను వెంటబెట్టుకుని మురుగు కాల్వలను తక్షణం మరమ్మతు చేయించేవారని, ఇప్పుడా పరిస్థితి లేదని ప్రతి చిన్న సమస్యకు ఈసీ అనుమతి కోసం ఎదురు చూడాల్సి ఉందన్నారు. ఇకనైనా కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు ముగిసిన రాష్ట్రాలలో సాధారణ పరిపాలనా వ్యవహారాలు, ప్రజలకు సాధారణ సేవలందించేందుకు వీలుగా ఎన్నికల కోడ్‌లో సడలింపులివ్వాలని మంత్రి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

జూన్‌లో విక్రవాండి ఉప ఎన్నిక?

● నేడో రేపో అధికారిక ప్రకటన!



చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి జూన్‌లో ఉప ఎన్నిక జరిగే అవకాశమున్నట్లు తెలిసింది. అక్కడ ఎమ్మెల్యేగా వ్యవహరించిన డీఎంకే నేత ఎన్.పుహళేంది అనారోగ్యంతో గత నెల 6వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. దీంతో ఆ నియోజకవర్గం ఖాళీ అయినట్లు ఇప్పటికే ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఒక పార్లమెంటు సభ్యుడు లేదా శాసనసభ్యుడు మరణించినా, లేదా రాజీనామా చేసినా ఖాళీ అయిన ఆ నియోజకవర్గానికి ఆరు నెలల్లోగా ఎన్నిక నిర్వహించాల్సివుంటుంది. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు గత నెల 19న పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికలతో పాటే కన్నియాకుమారి జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయతరణి రాజీనామా చేసిన విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రెండు విడతల సార్వత్రిక ఎన్నికలు ముగిసి మరో ఐదు విడతల ఎన్నికలు జరగాల్సి ఉంది. తుదివిడత లోక్‌సభ ఎన్నికలు జూన్ 1వ తేది జరుగనున్నాయి. ఆ నియోజకవర్గాల్లో నామినేషన్ దాఖలు ఈ నెల 7వ తేది ప్రారంభమవుతుంది. నామినేషన్ పత్రాల వాపసుకు 17వ తేది వరకు గడువు విధించారు. ఈ చివరి విడత లోక్‌సభ ఎన్నికలతో పాటు ప్రస్తుతం ఖాళీగా వున్న విక్రవాండి నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించడంపై ఎన్నికల కమిషన్ సమాలోచనలు చేస్తోంది. ఒకవేళ జూన్ 1వ తేది ఉప ఎన్నిక నిర్వహిస్తే, జూన్ 4న ఫలితాలు ప్రకటించే అవకాశముందని ఎన్నికల కమిషన్ అధికారులు భావిస్తున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. ఆ మేరకు అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

తారెత్తిస్తున్న ఎండలు

పెరంబూర్, మే 1: రాష్ట్రంలో బుధవారం భానుడి ప్రతాపం తీవ్రరూపం దాల్చింది. రాష్ట్రంలోనే ఈ ఏడాది గరిష్ట ఉష్ణోగ్రతగా వేలూరు, కరూర్ పరమత్తిలో 43.8 డిగ్రీల సెల్సియస్, చెన్నై నుంగంబాక్కంలో 40.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో మార్చి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రజలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావద్దని పలు జిల్లాల కలెక్టర్లు సూచించారు. అదే సమయంలో, రాబోయే రెండు రోజుల్లో 20 ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో బుధవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



● వేలూరులో గరిష్ఠంగా 43.8 డిగ్రీలు
● నుంగంబాక్కంలో 37.7 డిగ్రీల నమోదు

వేలూరు, కరూర్ పరమత్తిలో అత్యధికంగా 43.8 డిగ్రీలు, ఈరోడ్‌లో 43.5, ధర్మపురి, సేలంలో 41.6, మదురైలో 41.1 డిగ్రీలు నమోదయ్యాయి. ఇక, నగరంలో ఈ ఏడాది తొలిసారిగా నుంగంబాక్కంలో 37.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రజలు శీతలపానీయాలు అధికంగా తాగాలని, అత్యవసర పనులకు తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అలాగే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తున్నామని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రులను సంప్రదించి చికిత్స పొందాలని ఆరోగ్యశాఖ సూచించింది.

కావేరి జలాల కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

● మంత్రి దురైమురుగన్



చింతాద్రిపేట మేడే పార్కు స్మారక స్తూపం వద్ద అంజలి ఘటిస్తున్న మంత్రి దురైమురుగన్, కోశాధికారి టీఆర్‌బాలు తదితరులు

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి కావేరి జలాలను పొందటానికి సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు రాష్ట్ర నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. బుధవారం చింతాద్రిపేటలోని మేడే పార్కులో డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కనిమొళి, ప్రధాన కార్యాలయం కార్యదర్శులు పూచ్చి మురుగన్, టీకేఎస్ ఇలంగోవన్, తొళిలాలర్ మున్నేట్ర సంఘం కార్యదర్శి ఎం.షణ్ముగం, మంత్రి సీవీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ.. కావేరి జలాలను విడుదల చేయాలని కావేరి నిర్వాహక మండలి ఆదేశించినా కర్ణాటక ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కావేరి జలాల కోసం ప్రతియేటా డీఎంకే ప్రభుత్వం పోరాడాల్సి వస్తోందన్నారు. కర్ణాటక జలాశయాల్లో నీటి నిల్వలు అధికంగా ఉన్నప్పుడు కూడా జలాలను విడుదల చేయడానికి కర్ణాటక ప్రభుత్వం అంగీకరించదన్నారు. కావేరి నిర్వాహక మండలి పలుమార్లు ఆదేశాలిచ్చినా కర్ణాటక ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇక ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సింది సర్వోన్నత న్యాయస్థానమేనని, త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయించి కావేరి జలాలు విడుదలయ్యేలా చర్యలు చేపడతామని దురైమురున్ పేర్కొన్నారు.

ఫోన్ కాల్స్‌పై అప్రమత్తం

నగరవాసులకు సైబర్ క్రైమ్ విభాగం విన్నపం



అదనపు డీజీపీ సంజయ్ కుమార్

అడయార్, మే 1: అజ్ఞాత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని రాష్ట్ర సైబర్ క్రైమ్ విభాగం అదనపు డీజీపీ సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల నగరానికి చెందిన ఒక వ్యాపారికి గుర్తు తెలియని కొందరు వ్యక్తులు ఫోన్ చేసి ఆయన కుమారుడు స్నేహితులతో కలిసి మోసానికి పాల్పడ్డాడంటూ బెదిరించి లక్ష రూపాయలను వసూలు చేశారని, ఇలాంటి సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, పోలీస్ ఉన్నతాధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ పట్ల మరింత అప్రమత్తంగా ఉంటూ వాటిని నిర్ధారించుకోవాలని సూచించారు. మీ ఇంటి సభ్యుల్లో ఒకరు నేరానికి పాల్పడ్డారంటూ వచ్చే ఫోన్ కాల్ వస్తే ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మోసాలకు పాల్పడే వారిలో అనేక మంది మోసగాళ్ళు మన సెంటిమెంట్స్ ఆసరా చేసుకుని బలవంతంగా డబ్బు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. అందువల్ల గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలకు ఎలాంటి సమాధానాలివ్వొద్దని కోరారు. ఇలాంటి మోసాలపై సైబర్ క్రైమ్ విభాగం టోల్ ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి సమాచారం చేరవేయాలని సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

సమాచార ధ్వని

సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, మే 1: రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ ఈ నెల 7 నుంచి 9వ తేది వరకు జరుగనుంది. నగరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణలో మూలికా సబ్బులు, ఫేస్ వాష్ జెల్, చుండ్ర నివారణ షాంపూ, బాడీ లోషన్, ఫేస్ క్రీమ్, లిప్ బామ్ వంటివి తయారు చేయడంపై శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్నవారు 8668102600, 7010186681 అనే నెంబర్లను సంప్రదించవచ్చు.

ఫొటోగ్రఫీపై శిక్షణ

ఐసిఎఫ్, మే 1: రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ఫొటో, వీడియో తీయడంపై మూడు రోజుల శిక్షణ ఇవ్వనుంది. స్థానిక ఈకాట్టుతాంగల్‌లోని ఈ సంస్థ ప్రాంగణంలో ఈ నెల 7,8,9 తేదీల్లో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణలో ఎడిటింగ్, యాప్, సాఫ్ట్‌వేర్ పని తీరు, ఫొటో, వీడియో షూట్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన వారు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 7010143022, 8668100181 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

18 మెట్రో రైల్వేస్టేషన్లలో పార్కింగ్ రుసుము పెంపు

ఐసిఎఫ్, మే 1: మెట్రో ప్రయాణికులు కాని వారికి 18 మెట్రో రైల్వేస్టేషన్లలో పార్కింగ్ రుసుము పెంచారు. ఈ విధానం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. నగరంలోని మెట్రో రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. కొన్ని స్టేషన్లలో సరిపడా పార్కింగ్ స్థలం లేదు. దీంతో పాటు ప్రయాణికులు కాని వారు కూడా తమ వాహనాలను ఈ పార్కింగ్‌లో పార్క్ చేసి వెళుతున్నారు. ప్రయాణికులు తమ వాహనాలు పార్కింగ్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని అడ్డుకొనేలా 18 మెట్రోరైల్వేస్టేషన్లలో సీఎంఆర్ఎల్ పార్కింగ్ రుసుము పెంచింది. ఆ ప్రకారం, ప్రయాణికులు కాని వారి బైక్‌లకు ఆరు గంటలకు రూ.25, ఫోర్ వీలర్‌కు రూ.40గా నిర్ణయించారు.

టెన్త్ తమిళ పుస్తకంలో కరుణానిధి పాఠ్యాంశం

ఐసిఎఫ్, మే 1: పదవ తరగతి తమిళ పుస్తకంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి (పన్ముగ కలైంజర్)' పేరుతో కొత్త పాఠ్యాంశాన్ని చేర్చారు. 2021 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే విజయం సాధించిన అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. గత ఏడాది 9వ తరగతి పాఠ్యపుస్తకంలో తమిళ భాషకు శాస్త్రీయ భాష హోదా లభించేందుకు కరుణానిధి చేపట్టిన చర్యలపై పాఠ్యాంశాన్ని చేర్చారు. ఈ నేపథ్యంలో, టెన్త్ తమిళ పాఠ్య పుస్తకంలో బహుముఖ ప్రజ్ఞాశాలి పేరుతో ఐదు పేజీలు కలిగిన పాఠ్యాంశాన్ని చేర్చారు.

స్టాంపుల సేకరణపై శిక్షణా శిబిరం

ఐసిఎఫ్, మే 1: స్థానిక అన్నాసాలై ప్రధాన తపాల కార్యాలయంలో ఉన్న స్టాంపుల సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణా శిబిరం జరుగనుంది. ఈ నెల 10,11,17,18,24,25 తేదీల్లో మూడు విభాగాలుగా నిర్వహించనున్న శిబిరాల్లో ఒక్కో శిబిరానికి 25 మంది చొప్పున 75 మందిని చేర్చుకోనున్నారు. శిక్షణలో తపాల బిళ్లల సేకరణపై పరిచయం, స్టాంపుల సేకరణ ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎలా సిద్ధమవ్వాలి, ఉత్తరాలు రాయడం, సమాచార నైపుణ్యం, తపాల కార్యాలయాల పనితీరు వంటి వాటిపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.250 చెల్లించి పేరు నమోదుచేసుకోవాలి. వివరాలకు 9444933467, 044-28543199 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

అడయార్‌లో మెట్రో ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం

ఐసిఎఫ్, మే 1: స్థానిక అడయార్ ప్రాంతంలో మెట్రో ఫ్లై ఓవర్ నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. చెన్నై మెట్రోరైలు రెండో విడతలో మాధవరం-షోలింగనల్లూర్ మార్గంలో సెయింట్ థామస్ మౌంట్-పూందమల్లి రోడ్డు సమీపంలోని అడయార్ ప్రాంతంలో మెట్రోరైలు మార్గం కోసం 8 స్తంభాలు ఏర్పాటుచేశారు. వాటిపై ఫ్లై ఓవర్ నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. కొన్ని వారాల్లో ఈ పనులు పూర్తవుతాయని, అనంతరం పట్టాల ఏర్పాటు చేపడతామని, 2026లో ఈ మార్గం అందుబాటులోకి వస్తుందని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

వారసత్వ సర్టిఫికెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 1: పాలసీదారులు వారసత్వ సర్టిఫికెట్ పొందేందుకు ఈ నెల 12వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఈఎస్ఐ చెన్నై మండల డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఈఎస్ఐ ఆస్పత్రులు, కొన్ని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో బీమాదారుల కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకొనేందుకు ఆసక్తి చూపే పాలసీదారుల పిల్లలు వారసత్వ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ సర్టిఫికెట్ పొందేందుకు ఈఎస్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ నెల 12వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 044-28306333, 044-28306363 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, మే 1: శుభ ముహూర్తాలు, వారాంతపు సెలవులను పురస్కరించుకొని ఈ నెల 3,4,5 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ప్రభుత్వ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. కిలంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, మదురై, ఈరోడ్ సహా వివిధ ప్రాంతాలకు ప్రతిరోజు నడిపే బస్సులతో కలిపి 3వ తేది 290 బస్సులు, 4వ తేది 365 బస్సులు, కోయంబేడు నుంచి నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు 3,4 తేదీల్లో 55 బస్సులు నడుపనున్నామన్నారు. బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. ఆదివారం సొంతూర్ల నుంచి చెన్నై, బెంగళూరు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు నడుపనున్నామన్నారు. టిక్కెట్ల బుకింగ్‌కు మొబైల్ యాప్, రవాణా సంస్థ వెబ్‌సైట్‌లో సంప్రదించ వచ్చన్నారు.

బీడీ కార్మికుడి కుమార్తెకు అభినందన

అడయార్, మే 1: గ్రూపు-1 పరీక్షల్లో విజయం సాధించిన బీడీ కార్మికుడి కుమార్తెను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. ఇదే విషయంపై ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూపు-1 పోస్టు కోసం 2022 జూలై నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పరీక్షలు గత యేడాది నవంబరు 19వ తేదీన జరిగాయి. ఈ ఫలితాలను గత నెలలో విడుదల చేయగా, తెన్‌కాశికి చెందిన బీడీ కార్మికుడి కుమార్తె శ్రీమతి విజయం సాధించగా, ఆమెకు ప్రభుత్వం అభినందనలు తెలిపింది.

పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మే 1: రాష్ట్ర విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి నమోదైంది. మార్చి నుంచే రాష్ట్రంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో, గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో ఏసీల వినియోగం అధికమైంది. ఈ క్రమంలో, మంగళవారం (ఏప్రిల్ 30వ తేది) విద్యుత్ వినియోగం గరిష్ఠంగా 20,700 మెగావాట్లకు చేరింది.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు



విద్యార్థినులు

ప్యారీస్, మే 1: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభమైంది. ఈ నెల రెండో వారంలోగా సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకునేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి విద్యా సంవత్సరం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూ, బ్యాగులతో పాటు సంక్షేమ సహాయాలు కూడా అందజేస్తున్నారు. మరోవైపు, ఉన్నత విద్యా కోర్సుల్లో చేరుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్న రూ.1000 ప్రోత్సాహక నగదు పథకంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ నిర్వహణలోని కళాశాలలు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. వైద్య, ఇంజనీరింగ్ టెక్నికల్ కోర్సుల్లో విద్యార్థులకు కల్పించిన 7.5 శాతం రిజర్వేషన్‌పై విద్యాశాఖ ప్రజల్లో అవగాహన కల్పిస్తుంది. ఇదిలావుండగా, 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ చర్యల ఫలితంగా ఇప్పటివరకు 3.27 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. మరికొద్ది రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టిక్కర్లపై పోలీస్ కమిషనర్‌కు బార్ కౌన్సిల్ లేఖ

ప్యారీస్, మే 1: ప్రైవేటు వాహనాల్లో స్టిక్కర్ల తొలగింపుపై గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్‌కు మద్రాసు హైకోర్టు న్యాయవాదుల సంఘం, తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో లేఖ రాశారు. ప్రైవేటు వాహనాల్లో మీడియా, పోలీస్, న్యాయస్థానం, న్యాయవాది, వైద్యుడు, సెక్రటరియేట్, టీఎన్ఈబీ తదితర పేర్లతో స్టిక్కర్లు అంటిస్తే మోటారు వాహన చట్టం 198వ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.. ఈ ప్రకటనలో, న్యాయస్థానం, న్యాయవాదులకు సంబంధించిన ఉత్తర్వులను వాపసు తీసుకోవాలంటూ హైకోర్టు న్యాయవాదులు పోలీసు శాఖను కోరారు. దీనిపై తమిళనాడు, పుదుచ్చేరి బార్ కౌన్సిల్ అధ్యక్షుడు పీఎస్ అమల్‌రాజ్ నేతృత్వంలో వెప్పేరిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఓ లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు నకిలీ న్యాయవాదులను అడ్డుకొనేందుకు న్యాయవాదులకు బార్ కౌన్సిల్ తరఫున పంపిణీ చేసే స్టిక్కర్ అంటించిన వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని పోలీస్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. సంబంధిత వాహనం ఆర్సీ బుక్, ఇన్సూరెన్స్, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ తదితరాలను పరిశీలించిన అనంతరమే వాహనాలకు స్టిక్కర్లు పంపిణీ చేస్తున్నట్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. ట్రాఫిక్ విభాగం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మోటారు వాహన చట్ట విభాగాలు 177,198 నెంబరు ప్లేట్‌కు సంబంధించినవి మాత్రమేనని, ఆ నిబంధనల మేరకు న్యాయవాదులు స్టిక్కర్లు అంటించడాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదని తెలిపారు. ఇదిలా ఉండగా, ట్రాఫిక్ పోలీసు శాఖ బుధవారం మధ్యాహ్నం ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియానుద్దేశించి ఓ ప్రకటన విడుదల చేసింది. అందులో, మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారి పేరు మీద వాహనాల రిజిస్ట్రేషన్ ఉండాలని, అదే సమయంలో సంస్థ గుర్తింపుకార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఇవి ఉన్న వాహనాలను అడ్డుకోబోమని స్పష్టం చేసింది.

ఆవిన్ దుకాణాల్లో 30 శాతం పెరిగిన మజ్జిగ విక్రయాలు



చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండలు అధికంగా ఉండటంతో ఆవిన్ దుకాణాలల్లో మజ్జిగ, లస్సీ, కుల్ఫీ ఐస్ అమ్మకాలు ఊపందుకున్నాయి. గతయేడాది ఏప్రిల్‌లో రోజూ 30 వేల బాటిళ్ల మజ్జిగ విక్రయించారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండటంతో మజ్జిగ సీసాల అమ్మకాలు పెరిగాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటిదాకా రోజూ 40 వేల సీసాల మజ్జిగ విక్రయిస్తున్నట్లు ఆవిన్ సంస్థ అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా మజ్జిగ ప్యాకెట్ల విక్రయాలు కూడా పెరిగాయని తెలిపారు. గత యేడాది ఏప్రిల్‌లో 10 వేల మజ్జిగ ప్యాకెట్లను విక్రయించగా, ప్రస్తుతం 18 వేల మజ్జిగ ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇవి కాకుండా లస్సీ, కుల్ఫీ ఐస్, కప్ ఐస్, కోన్ ఐస్, బాదంగీర్ సీసాల అమ్మకాలు కూడా రెట్టింపు అయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్‌ను బట్టి మజ్జిగ సీసాలు, మజ్జిగ ప్యాకెట్లను అధికంగా సరఫరా చేయనున్నామని చెప్పారు.

రూ.19 తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్

పెరంబూర్, మే 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.19కి తగ్గింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా ఆయిల్ సంస్థలు సిలిండర్ ధరల్లో మార్పులు చేపడుతుంటాయి. ఆ ప్రకారం, ఆయిల్ సంస్థలు బుధవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 19 కిలోల వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.19 తగ్గి రూ.1,911కు విక్రయమవుతోంది. ఇక గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పులు లేక, 14 కిలోల సిలిండర్ రూ.818.50కి విక్రయమవుతోంది.

అరుణాచలేశ్వరుడి హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు

పెరంబూర్,మే1:తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.23 కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయ చిత్తిరై మాస హుండీల లెక్కింపు మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై రాత్రి 7 గంటలకు ముగిసింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.2,23,71,962 నగదు, 365 గ్రాముల బంగారం, 2,838 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ కానుకలుగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తగ్గిన జల విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మే 1: నీటి కొరతతో జల విద్యుదుత్పత్తి తగ్గింది. రాష్ట్ర విద్యుత్ బోర్డుకు 2,321 మెగావాట్ల సామర్థ్యంతో 47 జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో డ్యాంల్లో నీరు అడుగంటింది. దీంతో ప్రతి రోజు ఉదయం 500 మెగావాట్లు, సాయంత్రం 750 మెగావాట్ల వరకు ఉత్పత్తి జరుగుతోంది. ఈ విషయమై విద్యుత్ బోర్డు అధికారులు మాట్లాడుతూ... డ్యాంల్లో నీరు నిండుగా ఉన్నప్పుడు ప్రతిరోజు 1,500 మెగావాట్లకు పైగా విద్యుదుత్పత్తి జరిగేదని తెలిపారు.

మంత్రుల అవినీతి కేసు విచారణ వాయిదా

ప్యారీస్, మే 1: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, రాష్ట్ర మంత్రులు సాతూర్ రామచంద్రన్, తంగం తెన్నరసులపై నమోదైన అవినీతి కేసుల విచారణ జూన్ నెలకు వాయిదాపడింది. అక్రమార్జన కేసుల నుంచి ఓపీఎస్, సాతూర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను చెన్నైలోని ప్రత్యేక కోర్టు విడుదల చేస్తూ జారీచేసిన తీర్పు రివ్యూ చేయాలని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ స్వతహాగా ముందుకు వచ్చి ఈ కేసులు మళ్లీ విచారణకు స్వీకరించారు. ఈ కేసులో ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి తరఫు న్యాయవాదులు వాదనలు ముగిసిన నేపథ్యంలో, అవినీతి నిరోధక శాఖ పోలీసుల తరఫు వాదనల కోసం విచారణ తేది ప్రకటించకుండా వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, ఈ కేసుపై మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ తదుపరి విచారణ జూన్‌కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రూల్స్ అతిక్రమిస్తే డీలర్లదే బాధ్యత

● పాత వాహనాలపై స్పష్టం చేసిన ట్రాఫిక్ విభాగం

ప్యారీస్, మే 1: పాత వాహనాలు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ఆ వాహనాలు విక్రయించిన డీలర్లే బాధ్యత వహించాలని ట్రాఫిక్ విభాగం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేశారు. అందువల్ల ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాల రిజిస్ట్రేషన్ గుర్తించి, ఆన్‌లైన్‌లో జరిమానా రసీదులు పంపిస్తున్నారు. అదే సమయంలో డీలర్ల నుంచి కొనుగోలు చేసే పాత వాహనాల గడువు ముగిసినా, ఆ వాహన రిజిస్ట్రేషన్ బట్టి చర్యలు తీసుకుంటున్నట్లు వాహనదారులు ట్రాఫిక్ విభాగానికి విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ట్రాఫిక్ విభాగం కమిషనర్ షణ్ముగసుందరం వాహన డీలర్లకు ఒక సర్క్యులర్ జారీచేశారు. అందులో... ఒకరి నుంచి కొనుగోలు చేసే వాహనాన్ని మరొకరికి విక్రయించే సమయంలో ఆలస్యం కాకుండా వాహన రిజిస్ట్రేషన్ దారుడి పేరు తప్పనిసరిగా మార్చాలని, వాహన యజమానులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే కారు, ద్విచక్రవాహనాలకు కొనుగోలుచేసిన వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితరాలు మార్చి ఇవ్వాలని 30 వేల మంది డీలర్లకు పంపిన సర్క్యులర్‌లో సూచించారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన కొత్త ఉత్తర్వులు త్వరలోనే అమలుకు వస్తాయని, అన్ని జిల్లాల ఆర్టీఏ అధికారులకు దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా పంపించినట్లు తెలిపారు. వాహన యజమానులు డీలర్ వద్ద 29సీ ఫారం పూర్తిచేసి నిబంధనలకు అనుగుణంగా ఆర్టీఏ కార్యాలయాల్లో తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని షణ్ముగసుందరం సూచించారు.

కావేరి జలాల పంపిణీ వ్యవహారం... నిర్వాహక మండలిపై వైగో ధ్వజం

ప్యారీస్, మే 1: ఒప్పందం ప్రకారం కావేరి జలాలను సరఫరా చేయడానికి నిరాకరిస్తున్న కర్ణాటక ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని కావేరి నిర్వాహక మండలిపై ఎండీఎంకే ఎంపీ వైగో ధ్వజమెత్తారు. కావేరీ జలాల పంపిణీపై తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాల మధ్య కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జలాలను సక్రమంగా పంపిణీ చేయడం లేదు. కావేరి జలాలపై కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు హక్కున్నప్పటికీ, ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి ప్రతి ఏటా 192 టీఎంసీల జలాలను కర్ణాటక ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అయితే కొన్ని నెలలుగా కర్ణాటక ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘించడంపై రాష్ట్రంలోని అన్నాడీఎంకే, ఎండీఎంకే, పీఎంకే, డీఎంకే పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అందులో భాగంగా ఎండీఎంకే నేత వైగో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... కావేరి నిర్వాహక మండలి నిర్లక్ష్యం వల్లే కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రానికి చెందాల్సిన కావేరి జలాలను పంపిణీ చేయకుండా మోసం చేస్తోందని, దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఖండించదగ్గదని సూచించారు.

చలివేంద్రాల ఏర్పాటుకు అనుమతి : ఈసీ

పెరంబూర్, మే 1: రాజకీయ పార్టీలు చలివేంద్రాల ఏర్పాటుకు అనుమతించామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేలా రాజకీయ పార్టీలు, ప్రైవేటు సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటుచేస్తుంటాయి. కానీ, ఈ ఏడాది మార్చి నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసినా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, చలివేంద్రాల ఏర్పాటుకు అనుమతించాలని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. దీనిపై స్పందించిన ఈసీ, రాజకీయ పార్టీలు చలివేంద్రాలు ఏర్పాటుచేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ, ఆ సమయంలో రాజకీయాలు లేకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రూ.50 కోట్లతో పారంపర్య భవనాల పునరుద్ధరణ

ఐసిఎఫ్, మే 1: రాష్ట్రవ్యాప్తంగా 8 పారంపర్య భవనాలను రూ.50 కోట్లతో పునరుద్ధరించనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. రాజులు, ఆంగ్లేయుల కాలాల్లో నిర్మించిన ప్రాచీన భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటి ప్రాచీనత దెబ్బతినకుండా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టి నిధులు కేటాయించింది. ఈ ఏడాది చెన్నై కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రి, చేపాక్కం పాత దస్తావేజుల భవనం, గిండి పరిశోధన కేంద్రం, తంజావూరు కోర్టు, పుదుకోట పబ్లిక్ కార్యాలయం, కోయంబత్తూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన కేంద్రం, మదురై జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, కారైకుడి శంకరపతి కోట భవనాలను రూ.50 కోట్లతో పునరుద్ధరించే పనులు ప్రారంభించినట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

పెరిగిన వెల్లుల్లి ధర

ఐసిఎఫ్, మే 1: దిగుబడి తగ్గడంతో వెల్లుల్లి ధరలు పెరిగాయి. స్థానిక కోయంబేడు మార్కెట్‌కు ప్రతిరోజు 50కి పైగా లారీల్లో వెల్లుల్లి దిగుమతవుతోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో గత ఏడాది దిగుబడులు తగ్గడంతో ధరలు పెరిగి, గరిష్టంగా కిలో రూ.350కు విక్రయమైంది. ఈ ఏడాది జనవరిలో దిగుబడులు పెరగడంతో కిలో రూ.80కి విక్రయించారు. ప్రస్తుతం వెల్లుల్లి కోతలు ముగిసినా, ఆన్‌లైన్ హోల్‌సేల్ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడంతో మళ్లీ ధరలు పెరిగాయి. కోయంబేడు మార్కెట్లో కిలో మొదటి రకం వెల్లుల్లి రూ.250, రెండవ రకం రూ.200, మూడవ రకం రూ.170కు విక్రయమవుతోంది.

వాణిజ్య భవనం నిర్మాణం కేసు ప్రత్యేక ధర్మాసనానికి బదిలీ

అడయార్, మే 1: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయ తూర్పు గోపురం (రాజగోపురం) సమీపంలో వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణను ప్రత్యేక ధర్మాసనానికి హైకోర్టు బదిలీ చేసింది. ఈ పిటిషన్‌ను ఆలయ భక్తుల సంఘం అధ్యక్షుడు టీఆర్ రమేష్ దాఖలు చేశారు. ఈ వాణిజ్య భవన సముదాయాన్ని రూ.6 కోట్లతో నిర్మించనున్నారు. దానికయ్యే ఖర్చు కూడా ఆలయ నిధుల నుంచే చేయనున్నారు. పైగా ఈ భవన సముదాయాన్ని నిర్మించడం వల్ల ఆలయ వేడుకలతో పాటు భక్తులకు అసౌకర్యంగా, ఆటంకంగా ఉంటుంది. అందువల్ల ఈ నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాల, జస్టిస్ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను ప్రత్యేక ధర్మాసనానికి బదిలీ చేస్తూ, తదుపరి విచారణ జూన్ రెండో తేదీకి వాయిదా వేసింది.

వ్యభిచారం చేస్తున్న మహిళ అరెస్ట్

పెరంబూర్, మే 1: స్థానిక వేళచ్చేరిలోని ఓ ఇంట్లో వ్యభిచారం చేస్తున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. వేళచ్చేరి ముత్యళగన్ వీధిలోని ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం రాత్రి ఆ ఇంట్లో తనిఖీలు చేసిన పోలీసులు వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించి, అందుకు కారణమైన ఝాన్సీ (40) అనే మహిళను అరెస్ట్ చేశారు. ఆ ఇంట్లో ఉన్న ఓ మహిళను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించారు. బుధవారం ఉదయం ఝాన్సీని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు నగర పోలీసు శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

తాగొస్తున్నాడంటూ తండ్రిని హతమార్చిన కుమార్తె

పెరంబూర్, మే 1: ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికొచ్చి గొడవ పడుతున్న తండ్రిని కుమార్తె హతమార్చిన ఘటన కన్నియాకుమారిలో చోటుచేసుకుంది. కడక్కరై గ్రామానికి చెందిన సురేష్ రోజూ మద్యం సేవించి ఇంటికొచ్చి గొడవకు దిగుతుంటాడు. ఆయన తీరుతో విసిగిపోయిన భార్య, కొద్దిరోజుల క్రితం అతడిని విడిచి వేరుగా వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో, కుమార్తె ఆర్తీతో కలసి ఉంటున్న సురేష్, తాగి ఇంటికొచ్చి గొడవకు దిగుతుండేవాడు. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 25న నిద్రపోయిన తన తండ్రి అనుమానాస్పదంగా మృతిచెందాడని ఆర్తీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆర్తీ తీరుపై అనుమానించి పోలీసులు ఆమెను విచారించగా, తాగి ఇంటికొచ్చి గొడవకు దిగిన తన తండ్రిని కర్రతో కొట్టడంతో తలకు గాయాలై మృతి చెందాడని ఆమె నేరాన్ని అంగీకరించింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఆర్తీని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

గుట్కా విక్రయం... 42 మంది అరెస్ట్

పెరంబూర్, మే 1: నగరంలో గుట్కా, మావా విక్రయాలకు పాల్పడుతున్న 42 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులతో 'డ్రైవ్ అగైనెస్ట్ బాన్డ్ టుబాకో ప్రొడక్ట్' పేరుతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నగరంలో ఈ గత నెల 24 నుంచి 30వ తేది వరకు ఏడు రోజుల్లో చేపట్టిన తనిఖీల్లో గుట్కా, మావా విక్రయాలపై 40 కేసులు నమోదు చేసి 42 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 201.7 కిలోల గుట్కా, 58 కిలోల మావా, 80 విదేశీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో 22 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. కాగా, జనవరి 1 నుంచి ఏప్రిల్ 30వ తేది వరకు గుట్కా, మావా తదితరాలు విక్రయిస్తున్న 285 దుకాణాలకు సీలు వేసినట్లు నగర పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెరంబూర్, మే 1: కాంచీపురంలో వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు మజ్జిగ అందజేస్తున్నారు. జిల్లాలో కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు పైగా నమోదవుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రాజకీయపార్టీలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. ప్రైవేటు , స్వచ్ఛంద సంస్థలు కూడా చలివేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల అధికారి వద్ద అనుమతులు తీసుకోవాల్సి ఉండడంతో వారూ చలివేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో, కాంచీపురం ముంగిల్ మండపం ప్రాంతంలో మధ్యాహ్నం ఎండలో వస్తున్న వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు మజ్జిగ పంపిణీ చేశారు.

ఏర్కాడు మృతుల కుటుంబాలకు తలా రూ.10 లక్షలు

● ఎడప్పాడి డిమాండ్

ప్యారీస్, మే 1: ఏర్కాడు బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు తలా రూ.10 లక్షలు అందజేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేలం జిల్లా ఏర్కాడు ఘాట్ రోడ్డులో ఏర్కాడు నుంచి సేలంకు ప్రయాణికులతో వెళ్లిన ఓ ప్రైవేటు బస్సు 13వ క్రాసింగ్‌లో సుమారు 60 అడుగుల లోతులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా, 60 మందికి పైగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో పర్వత శ్రేణులపై ఉన్న పర్యాటక ప్రాంతాలకు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు వెళ్లే ప్రజలకు తగిన భద్రత కల్పించాలని, ముఖ్యంగా కొండపై ఉన్న ఘాట్ రోడ్లలో నడిపే వాహనాలను తనిఖీచేసేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని పళనిస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఏర్కాడు బస్సు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురి కుటుంబాలకు తలా రూ.10 లక్షలు పంపిణీ చేయాలని అలాగే, తీవ్రంగా గాయాలైన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేలు ప్రభుత్వం తరఫున అందజేసి ఉన్నత వైద్య చికిత్స కూడా ఇప్పించాలని ఈపీఎస్ కోరారు. ఏర్కాడు మృతుల కుటుంబాలతో పాటు విరుదునగర్ జిల్లా కారియపట్టి సమీపంలోని ఆవియల్ ప్రాంతంలో ఉన్న క్వారీలో సంభవించిన పేలుళ్లలో మృతిచెందిన నలుగురి కుటుంబాలకు అన్నాడీఎంకే తరఫున ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. అలాగే క్షతగాత్రులు త్వరంగా కోలుకోవాలని దైవాన్ని ప్రార్థిస్తున్నట్లు ఈపీఎస్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

తపాలా ఓట్ల విభజన ప్రారంభం

● ఆయా నియోజకవర్గాలకు తరలింపు

ప్యారీస్, మే 1: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో నమోదైన పోస్టల్ ఓట్ల విభజన ప్రారంభమైంది. ఈ రెండు రాష్ట్రాల్లో మొత్తం 40 నియోజకవర్గాలకు పోస్టల్ ఓట్ల తరలింపు ప్రక్రియ భారీ పోలీసు బందోబస్తు, ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతలుగా జరుగుతున్న నేపథ్యంలో, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో తొలివిడతగా గత నెల 19న పోలింగ్ జరిగింది. ముందుగా ఏప్రిల్ 17,18 తేదీల్లో ఎన్నికల భద్రత, పోలింగ్ తదితర విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగుల నుంచి పోస్టల్ ఓట్లు వేసేందుకు వారు శిక్షణ పొందిన కేంద్రాల్లోనే వసతులు కల్పించారు. అందేకాకుండా వారు పనిచేసిన పోలింగ్ కేంద్రాల్లోనే ఆన్‌లైన్ పోలింగ్ సదుపాయం కూడా సమకూర్చారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు కూడా పోస్టల్ ఓట్లు నమోదుచేశారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో 39 నియోజకవర్గాల్లో మొత్తం నమోదైన 93,642 పోస్టల్ ఓట్లు, పుదుచ్చేరిలో నమోదైన 21,891 పోస్టల్ ఓట్లను తిరుచ్చి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రధాన ఓట్ల సేకరణ కార్యాలయానికి తరలించారు. ఈ ఓట్లను నియోజకవర్గాల వారీగా తరలించే పనులు ప్రారంభించినట్లు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు.

జీసీసీకి తగ్గిన పన్ను వసూళ్లు

ప్యారీస్, మే 1: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో లోక్‌సభ ఎన్నికల కారణంగా పన్ను వసూళ్లు తగ్గిందని అధికారులు తెలిపారు. జీసీసీ రెవెన్యూ, పన్నుల వసూళ్లు తదితర విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు మార్చి, ఏప్రిల్ నెలల్లో లోక్‌సభ ఎన్నికల డ్యూటీలో పాల్గొన్నారు. అందువల్ల ఏప్రిల్‌లో వసూలు కావాల్సిన పన్నులో రూ.37 కోట్లు తగ్గిందని, గత ఏడాది ఏప్రిల్‌లో రూ.370 కోట్లు వసూలైందని అధికారులు తెలిపారు. పన్నులు చెల్లిస్తున్న వారికి సకాలంలో పన్ను చెల్లించే విధంగా, వాణిజ్య సంస్థల నుంచి నిల్వ ఉన్న బాకీ వసూలుచేసే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 2022-23వ ఆర్థిక సంవత్సరం కంటే ఈ సంవత్సరంలో రూ.44 కోట్లు పెరిగిందని, ఇప్పటివరకు పన్నుల రూపంలో రూ.1,600 కోట్లు వసూలైందని, ఇందులో తేనాంపేట జోన్‌లో గరిష్ఠంగా రూ.315 కోట్లు వసూలైనట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

భారత జట్టులో నటరాజన్‌ను ఎంపికచేయాలి

బీజేపీ నేత శరత్‌కుమార్

పెరంబూర్, మే 1: 'టి 20 వరల్డ్ కప్' కోసం ప్రకటించిన భారత జట్టులో నటరాజన్‌ను ఎంపిక చేయాలని బీజేపీ నేత, నటుడు శరత్‌కుమార్ బీసీసీఐకి విజ్ఞప్తి చేశారు. వరల్డ్ కప్‌లో పాల్గొనే భారత జట్టును మంగళవారం ప్రకటించగా, రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ఒక్కరికీ చోటు దక్కలేదు. ఈ విషయమై శరత్‌కుమార్ తన 'ఎక్స్'లో... భారత జట్టులో నటరాజన్‌కు చోటు దక్కకపోవడం బాధాకరమన్నారు. ఎడమ చేతి ఫాస్ట్ బౌలర్‌గాను, 'యార్కర్ స్పెషలిస్ట్'గా పేరుగాంచిన నటరాజన్ ఇటీవల కాలంలో విశేషంగా రాణిస్తున్నారని, అవకాశముంటే అతడిని భారత జట్టులో చేర్చుకొనే అంశం పునఃపరిశీలించాలని శరత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

చెంగల్పట్టులో తైవాన్ వాసి అనుమానాస్పద మృతి

అడయార్, మే 1: చెంగల్పట్టు సమీపంలోని ఒరగడం వద్ద తైవాన్ దేశానికి చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ ప్రాంతంలో అనేక కంపెనీలు, పరిశ్రమలుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన వారు పనిచేస్తున్నారు. ఇలాంటి వారిలో తైవాన్ దేశానికి చెందిన షెన్ షింగ్ షాన్ (53) అడ్మిన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన విధులు ముగించుకుని ఇంటికి వెళ్ళే సమయంలో మద్యం సేవించి వెళ్ళాడు. అయితే, మంగళవారం విధులకు రాకపోవడంతో ఆయన పై ఉద్యోగి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో షాన్ ఇంటికి వెళ్ళి చూడగా విగతజీవిగా పడివున్నాడు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఒకేరాత్రిలో 130 మంది రౌడీషీటర్ల అరెస్ట్

● ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్

ప్యారీస్, మే 1: స్థానిక ఆవడి పోలీస్ కమిషనర్ పరిధిలో ఒకే రోజు రాత్రి 130 మంది రౌడీషీటర్లను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ శంకర్ పేర్కొన్నారు. ఆవడి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా హత్య, దోపిడీ, గంజాయి విక్రయం తదితర సంఘటనలు కొనసాగుతున్నాయి. ముత్తాపుదుపేట పోలీస్‌స్టేషన్ సమీపంలోని నగల దుకాణంలో చొరబడిన దొంగలు నగలు దోచుకొని పరారయ్యారు. ఓ ఆయుర్వేద వైద్యుడు, ఆయన భార్యను దారుణంగా హతమార్చిన యువకుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ రకంగా హత్య, దోపిడీ సంఘటనలతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో, ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ నేరాలు అదుపుచేసేందుకు చేపట్టిన చర్యల గురించి మంగళవారం మీడియాకు వివరించారు. నేరాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు నియమించినట్లు తెలిపారు. ముఖ్యంగా పలు నేర సంఘటనలతో అధిక సంబంధాలున్న 130 మంది రౌడీషీటర్లను ఒకేరోజు రాత్రి అరెస్ట్ చేశామని, ఈ చర్యలు ఇలాగే కొనసాగుతాయని శంకర్ తెలిపారు.

ఆస్తులు కాజేసి తండ్రిని యాచకుడిగా మార్చిన తనయుడు

● తిరువళ్లూరు కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న రఘునాధన్

ప్యారీస్, మే 1 :తిరువళ్లూరులో ఆస్తులను లాక్కున్న కుమారుడు తండ్రిని భిక్షగాడిగా మార్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. తిరువళ్లూరు భారతిదాసన్ వీధిలో రఘునాధన్ (76) అనే మాజీ ప్రభుత్వ ఉద్యోగి నివసిస్తున్నారు. ఆయనకు బాలాజీ అనే కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. రెండేళ్ల క్రితం ఆయన భార్య ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె పేరుతో బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.19లక్షలు, 25 సవర్ల నగలు, వెండి ఆభరణాలు, భూములకు సంబంధించిన పత్రాలు, ఆస్తులకు సంబంధించి బ్యాంక్ లాకర్లలో దాచిన ఆస్తులన్నింటిని బాలాజీ తన పేరుమీద మార్చుకుని తండ్రిని దాయాదాక్షిణ్యం లేకుండా ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో ఏం చేయాలో పాలుపోక రఘునాధన్ వారం రోజులుగా తిరువళ్లూరు వీరరాఘవపెరుమాళ్ ఆలయం వద్ద భిక్షమెత్తుకుంటూ సంచరిస్తున్నాడు. మనో వేదనకు గురైన రఘునాధన్ తన కుమారుడి మోసం గురించి తిరువళ్లూరు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తన కుమారుడు, అతడి భార్య కుటుంబీకులు పథకం పన్ని తను కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు, సంపాదించిన ఆస్తులను లాక్కున్నారని, దీనిపై విచారణ జరిపిన తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చికెన్ రైస్ తిని తీవ్ర అస్వస్థత

పెరంబూర్, మే 1: నామక్కల్‌లో చికెన్ రైస్ తిన్న ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నామక్కల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్‌లో మంగళవారం సాయంత్రం నదియ, షణ్ముగనాధన్ చికెన్ రైస్ తిన్నారు. కొంతసేపటికి వారు వాంతులు చేసుకుంటూ స్పృహ కోల్పోయారు. చుట్టుపక్కల వారు వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కలెక్టర్ ఉమ ఆదేశాలతో ఆహార భద్రతా శాఖ అధికారులు హోటల్ తనిఖీ చేసి, హోటల్ యజమాని జీవరత్నం, సహాయకుడు, వంట మాస్టర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సెయిలర్ నేత్రా కుమార్‌కు రూ.25 లక్షల సాయం

● అందజేసిన డాక్టర్ టీఆర్ పారివేందర్



నేత్రా కుమార్‌కు చెక్కు అందజేస్తున్న టీఆర్ పారివేందర్

అడయార్, మే 1: ఒలింపియన్, సెయిలర్ నేత్రా కుమార్‌కు ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ ఘనంగా సన్మానించడమే కాకుండా రూ.25 లక్షల ఆర్థిక సాయం కూడా చేసింది. ఈ తరహా క్రీడాకారులతో పాటు క్రీడలను దేశంలో తమ విద్యా సంస్థ మాత్రమే ప్రోత్సహిస్తుందని ఆ విద్యాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ టీఆర్ పారివేందర్ తెలిపారు. సెయిలర్ నేత్రా కుమార్ సన్మాన కార్యక్రమం బుధవారం నగరంలో జరిగింది. ఇందులో పెరంబలూరు ఎంపీ, ఎస్ఆర్ఎం వ్యవస్థాపకుడైన పారివేందర్ మాట్లాడుతూ, ఒలింపిక్స్‌కు అర్హత సాధించి, దేశం తరపున ప్రాతినిధ్యం వహించడం వెనుక అతడి పట్టుదల, కృషి, నిబద్ధత దాగివున్నాయని కొనియాడారు.. ఇలాంటి క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడానికి దేశంలో ఉన్న ఏకైక విద్యా సంస్థ ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ మాత్రమేనని, క్రీడాకారుల కోసం రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. అథ్లెట్లు, క్రీడల మౌలిక సదుపాయాల కోసం యేటా రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. తాజాగా తాము ప్రారంభించిన స్విమ్మింగ్‌పూల్‌లో అంతర్జాతీయ ఈత పోటీలను కూడా నిర్వహించగలమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ సి.ముత్తమిళ్‌సెల్వన్, క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్.మోహన కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

రోజా పార్క్‌లో బ్యాటరీ కారు సదుపాయం


రోజా పార్క్‌లో బ్యాటరీ కారులో పర్యాటకులు

పెరంబూర్, మే 1: కొడైకెనాల్ రోజా పార్క్‌లో పర్యాటకులకు బ్యాటరీ కారు సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో 10 ఎకరాల విస్తీర్ణంలో 500 రకాలకు చెందిన సుమారు 16 వేల రోజా మొక్కలు ఏర్పాటుచేశారు. ఆ పార్క్ వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం గతంలో ఏర్పాటుచేసిన బ్యాటరీ కార్లు మరమ్మతులకు గురై నిలిపివేశారు. ఈ క్రమంలో, వేసవి సీజన్ కావడంతో పార్క్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో, బ్యాటరీ కార్లకు మరమ్మతులు చేపట్టిన అధికారులు, తిరిగి వాటిని అందుబాటులోకి తీసుకురావడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో సరస్వతి అమ్మవారు

ప్యారీస్, మే 1: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళ్యం సమీపం ఆర్యపాక్కంలో వెలసిన విద్యారంభ జ్ఞాన మహాస్వతి ఆలయంలో బుధవారం లోక కల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటలకు గోపూజ, 7.15 గంటలు హోమం, 8 గంటలకు అభిషేకం, 8.30 గంటలకు అలంకారం, 8.45 గంటలకు కుంకుమార్చన, భక్తిగీతాలాపన, దీపారాధన, మహా ప్రసాదం, 11 గంటలకు అక్షరాభ్యాస కార్యక్రమాలను ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల సందర్భంగా చదువుల తల్లి సరస్వతి దేవిని విశేషంగా అలంకరించారు. పూజల్లో భాగంగా పాఠశాలలో చేరే పిల్లలచేత గురుస్వామి భక్తవత్సలం అక్షరాభ్యాసం చేయించారు. చివరగా పూజల్లో పాల్గొన్న భక్తులందరికి ఆలయ ధర్మకర్త డా.పీవీ కృష్ణారావు అన్న ప్రసాదాలను, ముత్తయిదువులకు పసుపు కుంకుమ పంపిణీ చేశారు.

లండన్ వెళ్లిన మంత్రి ఉదయనిధి

ప్యారీస్, మే 1: డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, రాష్ట్ర మంత్రి ఉదయనిధి విశ్రాంతి కోసం లండన్ నగరానికి వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ వెళ్లలేని ప్రాంతాలకు వెళ్లి 24 రోజుల ప్రచారంలో ఉదయనిధి పాల్గొన్నారు. ఆయన 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో 8,465 కి.మీ ప్రయాణించి 122 ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఎన్నికలు ముగిసి ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్నందున పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో మంత్రులెవ్వరూ పాల్గొనడం లేదు. అందువల్ల కుటుంబంతో కలసి 10 రోజులు విశ్రాంతి తీసుకొనేందుకు మంత్రి ఉదయనిధి మంగళవారం చెన్నై నుంచి విమానంలో లండన్ బయల్దేరి వెళ్లారు. ఆయన విశ్రాంతి కోసం లండన్ వెళ్లినందువల్ల ఆయన పర్యటన కార్యక్రమాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ఈ నెల 10న ఆయన తిరిగొస్తారని సమాచారం.

ఘనంగా మేడే వేడుకలు


మేడే పార్క్‌లో స్మారక స్థూపానికి దిండివనం శ్రీరాములు, ప్రభాకర్ నివాళి

ప్యారీస్, మే 1: అంబేడ్కర్ మున్నని కళగం (ఏఎంకే) చెన్నై పోర్ట్ ఎస్సీ, ఎస్టీ కార్మికుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చింతాద్రిపేటలోని నేపియర్ పార్క్‌లో ఉన్న కార్మికుల స్మారక స్థూపం వద్ద ఏఎంకే వ్యవస్థాపకులు దిండివనం శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్ తదితరులు అంజలి ఘటించారు. అలాగే, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే స్థూపం వద్ద అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులర్పించారు.

డీఎండీకే ఆఫీసులో ...


మేడే సందర్భంగా కార్మికులకు భోజనం వడ్డిస్తున్న ప్రేమలత

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో మేడే వేడుకలు బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలతా విజయకాంత్ పాల్గొని పార్టీ కార్మిక సంఘం జెండా ఎగురవేశారు.ఈ సందర్భంగా పేద కార్మికులకు ఆర్థిక సహాయాలు, ఆటో కార్మికులు ఖాకీ దుస్తులు పంపిణీ చేశారు. తరువాత కార్మికులందరికీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డిప్యూటీ కార్యదర్శులు ఎల్కే సతీష్, పి.పార్థసారథి, కార్మిక విభాగం కార్యదర్శి జి.కాళిరాజన్, కోశాధికారి పి.వేణురామ్, డిప్యూటీ అధ్యక్షులు టీకే వజియ్ వెంకటేష్, పొన్ ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాక్టర్ల బహూకరణ

● మేడే సందర్భంగా అందజేసిన రాఘవ లారెన్స్ ● 'మాత్రం'కు ఎస్‌జే సూర్య చేయూత

చిత్రజ్యోతి

కొరియోగ్రాఫర్, నిర్మాత, దర్శకుడు, నటుడు రాఘవ లారెన్స్ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మరో బృహత్తర సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాను స్థాపించిన 'మాత్రం' ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది రైతులకు ఉచితంగా ట్రాక్టర్లు అందజేశారు. ఈ ట్రాక్టర్ల ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో జరిగింది. ఇందులో మరో నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య, లారెన్స్ తల్లి, లారెన్స్ అభిమానులు, లబ్ధిదార రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ, 'కార్మికుల దినోత్సవం సందర్భంగా తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 'సేవే దైవం' పేరుతో ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమంలో భాగంగా దేశానికి వెన్నెముక అయిన రైతులకు తొలి దశగా పది ట్రాక్టర్లను బహూకరించామన్నారు. అవసరమైన వారికి తగిన విధంగా సాయం చేసేందుకు తమతో చేతులు కలుపుతారని, మాటల కంటే పనితీరుభిన్నంగా ఉంటుంది. ఈ ప్రయాణంలో అందరి మద్దతు ఇవ్వాలని, మున్ముందు భారీ స్థాయిలో సాయం చేయడానికి అందరి ఆశాస్సులు కావాలని కోరారు. కాగా, ఈ చారిటబుల్ ట్రస్ట్‌కు నటుడు ఎస్‌జే సూర్య తన వంతు సాయంగా రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.


ట్రాక్టర్ ప్రదానోత్సవ కార్యక్రమం

ఇండస్ట్రీని నమ్ముకున్న వారికి అవకాశాలు ఎక్కడ?

● వనితా విజయకుమార్



'దండుపాళ్యం' ఆడియో రిలీజ్ దృశ్యం

తమిళ చిత్రపరిశ్రమను నమ్ముకుని, ఇక్కడే స్థిరపడిన నటీనటులకు సినిమా అవకాశాలు ఎక్కడ అంటూ సినీ నటి వనితా విజయకుమార్ ప్రశ్నిస్తున్నారు. వనిత, సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దండుపాళ్యం'. ఇతర పాత్రల్లో ముమైత్ ఖాన్, సూపర్‌గుడ్ ఫిలిమ్స్ సుబ్రమణ్యం, బిర్లా బోస్, ఆలియా, నిషా రఫీక్ ఘోష్, రవిశంకర్ తదితరులు నటించగా, టైగర్ వెంకట్ స్వీయ నిర్మాణంలో దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆడియో కార్యక్రమంలో సినీ ప్రముఖులు ఆర్.అరవింద్‌రాజ్, మంగై అరిరాజన్, సౌందర్, ఎస్.విజయమురళి, క్రైమ్ సెల్వరాజ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ, '1980 నుంచి నేటి వరకు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో దోపిడీలు, హత్యలు వంటి ఘోరాలకు ఓ ముఠా పాల్పడుతుంది. వీరిలో ఒక బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుంటారు. ఈ ముఠాపై 390 చోరీలు, 108 హత్యలు, 90 అత్యాచారం లాంటి కేసులు ఉన్నాయి. ఒకే ముఠాకు ఆరు సార్లు మరణ శిక్ష పడుతుంది. ఈ కేసులు ఇంకా కొనసాగుతున్నాయి. కానీ, ఇప్పటివరకు ఒక్కరికి కూడా మరణ శిక్ష అమలు చేయలేదు. అరెస్టయిన వారిని అన్ని కేసుల్లో నిర్దోషులుగా విడుదల చేస్తున్నారు. ఇపుడు కేవలం పది కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసులోని నిందితులంతా నిరక్షరాస్యులైన దినసరి కూలీలు. ఇలాంటి యథార్థ సంఘటనల సమూహారమే ఈ చిత్ర కథ. మొదటి భాగానికి రెండో భాగానికి ఎంతో వ్యత్యాసం ఉంటుంది' అని పేర్కొన్నారు. వనితా విజయకుమార్ మాట్లాడుతూ, 'ఒక మంచి కథలో నటించానన్న అనుభూతి మిగిలింది. సహ నటి సోనియా అగర్వాల్‌తో మంచి బాండింగ్ ఏర్పడింది. తమిళనాడులో స్థిరపడి, ఇండస్ట్రీనే నమ్ముకున్న వారికి అవకాశాలు రావడం లేదు. ఇది విచారించదగిన విషయం. వాస్తవిక సంఘటనలను అద్భుతంగా తెరకెక్కించారు. అనేక సన్నివేశాల్లో సోనియాతో పోటీపడి నటించాను' అని పేర్కొన్నారు.


మిష్కిన్, సాయి ధనిష్క

ఆలయాలకు వెళ్లొద్దు..

సినిమాలకు వెళ్ళండి : దర్శకుడు మిష్కిన్

సినిమా ఒక దైవం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఆలయాలకు కాకుండా, సినిమాలకు వెళ్ళాలని ప్రముఖ దర్శకుడు మిష్కిన్ పిలుపునిచ్చారు. తప్పు చేసేవారు, చేయబోయేవారు మాత్రమే ఆలయాలకు వెళ్తుంటారన్నారు. ఏ తప్పూ చేయనివారు హాయిగా నవ్వుకుంటూ కొన్ని గంటల పాటు ప్రశాంతంగా ఉండాలని కోరుకునేవారు సినిమాలకు వెళ్ళాలని సూచించారు. గోల్డెన్ స్టూడియోస్ పతాకంపై నిర్మాత గోమతి నిర్మాణంలో కొరియోగ్రాఫర్ రాధిక మాస్టర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది ప్రూఫ్'. సాయి ధనిష్క ప్రధాన పాత్ర పోషించారు. రుత్వీర్ వదన్, మైమ్ గోపి, రిత్విక, ఇంద్రజ తదితరులు ఇతర పాత్రల్లో నటించగా, త్వరలోనే విడుదల చేయనున్న ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకులు మిష్కిన్, ఆర్వీ ఉదయకుమార్, నిర్మాత కె.రాజన్, గేయ రచయిత స్నేహన్, నటుడు రోబో శంకర్, సంతోష్ ప్రతాప్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఇందులో మిష్కిన్ మాట్లాడుతూ, 'సినిమా అనేది దైవం వంటిది. ఆ దైవాన్ని ప్రార్థించాలి. ఒక కుటుంబంలో ఆరుగురు సభ్యులుంటే కనీసం ఐదుగురు నెలలో ఒకరోజైనా సినిమాకు వెళ్ళాలి. సినిమా ఒక కళ. మూడు గంటలపాటు హాయిగా కాలాన్ని గడిపేయొచ్చు' అని అన్నారు. హీరోయిన్ సాయి ధనిష్క మాట్లాడుతూ, 'చాలా మంది మహిళల ఎదుగుదలకు పురుషులు అడ్డంకిగా ఉంటారని చెబుతుంటారు. కానీ, నా కెరీర్ ఎదుగుదలకు పురుషులే కారణం. ఇకపై నాకు సినిమా అవకాశాలు వస్తాయా అనే ఆలోచనలో ఉండగా, వచ్చిన అవకాశమే ఈ చిత్రం. రాధికా డార్లింగ్ దర్శకురాలు అవుతారని ఊహించలేదు. స్టోరీ చాలా బాగుంది. దీపక్ ఐదేళ్ళ క్రితం చిన్నపిల్లవాడు. ఇపుడు నా చిత్రానికి సంగీతం అందించారు. మహిళ భద్రతను తెలిపే చిత్రంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. దర్శకురాలు రాధికా మాస్టర్ మాట్లాడుతూ, 'ఈ సినిమా విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. సాయి ధనిష్క అద్భుతంగా నటించారు. ఈ సినిమా ద్వారా నా కుమారుడు సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారని, మీడియా బ్లెస్సింగ్స్ ఇవ్వాలని కోరారు.


కొడైకెనాల్ వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సాధారణ పౌరులతో కలిసి తిరుగుతున్న దృశ్యం


చెన్నైలో టీఎంసీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పారిశుధ్య కార్మికులకు సహాయాలు పంపిణీ చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్


బుధవారం గుజరాత్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు

అట్టహాసంగా రెగట్టా పోటీలు ప్రారంభం

చెన్నై, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో యూనిఫి కేపిటల్ ఆఫ్‌షోర్ మూడో విడత రెగట్టా పోటీలు బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఈ నెల ఐదువరకు కొనసాగనున్నాయి. మద్రాసు పోర్ట్ ట్రస్టులో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ పోటీలను రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ మేఘనాథరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇండియన్ మేరిటైమ్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మాలిని వి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్మీ, నేవీ, కోస్టుగార్డ్ ప్రాంతీయ అధికారులు కూడా విచ్చేశారు. ఈ రెగట్టా పోటీల్లో పేరొందిన సైలర్లు మురుగన్ నాడార్, ఆయజ్ షైక్, చిన్నారెడ్డి, ఏఎన్ స్వామి పాల్గొంటున్నారు. ఈ రెగట్టా పడవల రేసు మద్రాసు పోర్ట్ నుంచి మహాబలిపురం వరకు, ఆ తర్వాత నగరం నుంచి కామరాజర్ పోర్ట్ వరకు కొనసాగుతాయి.




రెగట్టా పోటీలను ప్రారంభించిన రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ మేఘనాథరెడ్డి తదితర ప్రముఖులు



గ్లెనెగ్లెస్ హెల్త్ సిటీలో 'మమ్మీ మేకోవర్' సేవలు

అడయార్, మే 1: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి గ్లెనెగ్లెస్ హెల్త్ సిటీలో ప్రసవానంతర శరీర పునరుద్ధరణ కోసం విప్లవాత్మకమైన 'మమ్మీ మేకోవర్' పేరుతో ఒక వినూత్న బాడీ రెస్టోరేషన్ సేవలను ప్రారంభించారు. చెన్నై నగరంలో ఈ తరహా సేవలను ప్రారంభించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ప్రతి మహిళ ప్రసవానంతరం గర్భం దాల్చడానికి ముందున్న శరీరాకృతిని, రూపాన్ని తిరిగి పొందేందుకు ఇష్టపడతారు. ముఖ్యంగా గర్భందాల్చడం వల్ల వచ్చే శారీరక మార్పులను పరిష్కరించడానికి వివిధ రకాలైన కాస్మోటిక్ సర్జరీ విధానాలను అనుసరిస్తున్నారు. ఇలాంటి వారికోసమే 'మమ్మీ మేకోవర్' సేవలను ప్రారంభించినట్టు హెల్త్ సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టికల్ అస్థెటిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ సెల్వ సీతారామన్ విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా సదరన్ ఇండియా వైశ్య సంఘం వ్యవస్థాపక దినోత్సవం


రంగస్థల నటుడు ఘంటసాల మదన్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మే 1: స్థానిక జార్జిటౌన్ గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివ) వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. బ్రిటీష్ పాలకుల హయాంలో 1905 మే 1న కులాల ప్రాతిపదికన ఏర్పాటైన ఈ తొలి సంఘం బుధవారం 120వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగా శివ అధ్యక్షుడు అజంతా గ్రూప్ సంస్థల అధినేత డా.కనిగెలుపుల శంకరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా సీనియర్ సభ్యుడు, రంగస్థల నటుడు ఘంటసాల మదన్‌కుమార్ హాజరై సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజంతా శంకరరావు మాట్లాడుతూ... సమాజ సంక్షేమం కోసం శివ తరఫున సామూహిక వివాహాలు, నిత్యాన్నదానం, విద్యానిధి, చరమ సంస్కారం సేవల గురించి వివరించారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఉన్న వైశ్య సంఘాలకు శివ ఆదర్శం కావాలని, ఇందుకు నిర్వాహకులతో కలసి సమష్టిగా కృషిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో మదన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. శివ గౌరవ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, కోశాధికారి పెసల రమేష్, సీనియర్ సభ్యులు మద్దాలి కాశీవిశ్వనాథ్, జీపీవీ సుబ్బారావు, మన్నారు ఉదయకుమార్, ఎం.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ పూజ

ప్యారీస్, మే 1: స్థానిక పార్క్ టౌన్ రాచప్ప వీధిలోని సత్యనారాయణ మందిర్‌లో బుధవారం శ్రేష్ఠా సేవా సంఘం ఆధ్వర్యంలో సత్యనారాయణ పూజ వైభవంగా జరిగింది. సంఘ సేవకులు బండారం అనంత పద్మనాభన్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఈ పూజా కార్యక్రమాలను సంస్థ నిర్వాహకులు గ్రంధి లక్ష్మీ శేఖర్, జిల్లా సతీష్‌కుమార్, డా.టి.మోహనశ్రీ, ఉప్పుటూరు నరసింహన్, కొత్తమాసి జయకుమార్ పర్యవేక్షించారు. 200 జంటలు పాల్గొన్న ఈ పూజలు సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సత్యనారాయణ పూజలో పాల్గొన్న భక్తులు




మెరీనా బీచ్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

పెరంబూర్, మే 1: స్థానిక మెరీనా బీచ్‌లోని దుకాణాలు, హోటళ్లలో ఆహార భద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టిక్కర్లు లేకుండా విక్రయిస్తున్న శీతల పానీయాలను వారు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నాణ్యతలేని టీ పౌడర్, చికెన్ తదితరాలు స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అలాగే, శీతల పానీయాల కాల పరిమితిని పరిశీలించిన అధికారులు, నకిలీ పదార్థాలు విక్రయించే వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

జోరుగా తాటిముంజల విక్రయాలు

పెరంబూర్, మే 1: నగరం, శివారు ప్రాంతాల్లో తాటిముంజల విక్రయాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు తాటిముంజలు, చెరకు రసం, శీతల పానీయాలు, జ్యూస్ తదితరాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, చుట్టుపక్కల జిల్లాలకు చెందిన రైతులు, కార్మికులు తమ ప్రాంతాల్లోని తాటికాయలు వాహనాల్లో నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మార్కెట్లు, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తాటిముంజలు విక్రయాలు జరుగుతున్నాయి. కొందరు తాటి కాయల నుంచి ముంజలు తీసి విక్రయిస్తుండగా, మరికొందరు ప్రజల ముందే తాటికాయల నుంచి ముంజలు తీసి విక్రయిస్తున్నారు. సైజు బట్టి ఒక ముంజ రూ.5 నుంచి రూ.10 వరకు ధర పలుకుతోంది. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ధరలు పట్టించుకోని ప్రజలు తాటిముంజలు కొనుగోలు చేసి సేవిస్తున్నారు.





తిరుపతిలో జోరుగా ప్రచారం సాగిస్తున్న అభ్యర్థులను, పార్టీల నాయకులను నిఘా నేత్రం ముచ్చెమటలు పట్టిస్తోంది. కాస్త హంగామాగా ఎక్కువ వాహనాలతో వెళ్దామన్నా ఎన్నికల అధికారులు ఏ మూల నుంచి చూసి లెక్కలు కడుతున్నారోననే భయం వెంటాడుతోంది. అభ్యర్థులు ఖర్చు పెట్టే ప్రతి రూపాయీ లెక్క పెట్టేందుకు అధికారుల బృందం వీరిని ఇప్పటికే అనుసరిస్తోంది. ప్రతి కదలికను వీడియోలో బంధిస్తోంది. పోలీసు శాఖ కనుసన్నల్లో ఈ నిఘా సాగుతోంది. సభలు, సమావేశాలు, జనసమీకరణకు, లౌడ్ స్పీకర్లకు వెచ్చించే ఖర్చునూ వ్యయ పరిశీలకులు లెక్కిస్తున్నారు. ఖర్చు పరిమితి దాటితే ఎన్నిక చెల్లదంటూ ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం వుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు జాగ్రత్తలు పడుతున్నారు. మద్యం, సారా, బిర్యానీల లాంటివి పంపిణీ చేస్తున్నప్పుడు రెండో కంటికి తెలియకుండా జాగ్రత్త పడాలని పార్టీ అనుచరగణానికి నేతలు పదేపదే చెబుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

ప్రజల నుంచే నాయకులు పుట్టేవారు



● మా రోజుల్లో

నాకిప్పుడు 88 ఏళ్లు. చాలా కాలం నుంచి ఎలక్షన్లు చూస్తున్నాను. ఆనాటి రాజకీయాల్లో ఉన్న రాజసమే వేరు. నాయకులు ప్రజల్లో నుంచి పుట్టేవాళ్లు. సేవ చేసే తత్వం ప్రజలే గుర్తించి నాయకుడిగా వెంట నడుస్తూ ప్రోత్సహించేవారు. అసలు కొంతమంది నిజాయితీపరులైన నేతలు వారికి రాజకీయ మక్కువ లేకపోయినా జనాభిప్రాయం చూసి కాదనలేక ప్రజల బాగోగులను భుజానికి ఎత్తుకునేవారు. అది ఒక బాధ్యతగా పనిచేసే వాళ్ళు. మా రోజుల్లో ఇంతటి ప్రచార ఆర్భాటం ఉండేది కాదు. గ్రామాల్లో ఒక పెద్ద మనిషి ఎలా చెప్తే అలా మాటకు కట్టుబడి ఆ ప్రకారమే ఓట్లు వేసే వాళ్లం. ఇప్పుడు పరిస్థితులు చూస్తే ఎవరి మాట ఎవరూ పట్టించుకోవడమే లేదు.

- బొక్కిసం పెద్ద మునెయ్య, వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

బాబు కోసం స్వదేశానికి..

● నేను సైతం..



యువగళం పాదయాత్రలో లోకేష్‌తో సారథినాయుడు

గల్ఫ్‌లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐ వడ్డమూడి సారథినాయుడు చంద్రబాబునాయుడుపై అభిమానంతో ఈ ఎన్నికలలో తన వంతుగా ప్రచారానికి వచ్చాడు. చంద్రగిరి మండలంలోని రవణప్పగారిపల్లెకు చెందిన ఈయన సౌదీ అరేబియాలో సిరామిక్ కంపెనీలో 20 ఏళ్ళగా పనిచేస్తున్నాడు. టీడీపీ అన్నా, చంద్రబాబునాయుడు అన్నా వల్లమాలిన ప్రేమ. సౌదీ అరేబియాలో టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. స్వదేశంలోని 2304 మందిని ప్రభావితం చేసేలా ఫోన్ కాల్స్ చేసినందుకు చంద్రబాబునాయుడు, లోకేష్‌ల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ సెలవు పెట్టి మరీ తాజాగా స్వస్థలం వచ్చాడు. నేను సైతం అంటూ రోజూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాడు.

- చంద్రగిరి


తిరుచానూరు సమీపంలో స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు

నాయకులకు మించిన నవరస నటనా సామ్రాట్టులు తెలుగునేలమీద లేరని నిరూపణ అవుతోంది. మొఖంలో అమాయకత్వాన్ని పులుముకుని ఎంతటి అబద్ధాలను అయినా బరితెగించి చెప్పేయచ్చని సీఎం జగన్‌రెడ్డిని చూస్తే అర్థం అవుతుంది. అందుకు ఇసుకే సాక్ష్యం. అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వంలో ఉచితం పేరుతో ఇసుకను దోచేశారంటూ నానా యాగీ చేసి, ప్రజలకు చవగ్గా కోరినంత ఇసుక అందించే విధానం అమలు చేస్తున్నామని ప్రకటించారు. నిజమేనేమో అని నమ్మిన జనాన్ని చూసి వైసీపీ నాయకులు నవ్వుకున్నారు. ఎక్కడికక్కడ రంగంలోకి దిగి ఇసుక తవ్వి నదులను గుల్ల చేశారు. శేషాచలం అడవుల్లో పుట్టి వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సముద్రంలో కలుస్తున్న స్వర్ణముఖి నదిని చూస్తే చాలు వైసీపీ ఇసుకదోపిడీ విశ్వరూపం కనిపిస్తుంది. తరాలుగా తిరుపతి జిల్లా ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చిన స్వర్ణముఖి.. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లూ వైసీపీ నాయకుల అవినీతి దాహం తీర్చింది. ఈ ఐదేళ్లలోనే స్వర్ణముఖిని పిండి దాదాపు రూ.2000 కోట్ల ఇసుకను వీరు సొమ్ముచేసుకున్నారు.



తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఇసుకాసురులకు మళ్ళీ ఓట్లేద్దామా?

స్వర్ణముఖిని చెరబట్టారు!

ఐదేళ్లలో రూ. 2 వేల కోట్ల ఇసుక దోపిడీ

అన్న చాటు తమ్ముడి అక్రమార్జన రూ.160 కోట్లు

చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో అధికార పార్టీ ముఖ్యనేత తమ్ముడికి రోజువారీ కప్పం కడితేనే ఇసుక ట్రాక్టర్ కదులుతుంది. లేదంటే స్వర్ణముఖి నది గట్టు కూడా దాటకముందే పోలీసులో లేక సెబ్ అధికారులో ప్రత్యక్షమవుతారు. ట్రాక్టర్ సీజ్ అవుతుంది. భారీగా జరిమానా పడుతుంది. చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిగారిపల్లి రీచ్ రెండు కంపెనీలకు కేటాయించినప్పటికీ వాటి పేరిట ఇసుక దందా నడుపుతున్నది తమ్ముడు గారేనన్నది బహిరంగ రహస్యం. చంద్రగిరి మండలంలో 60 ఇసుక ట్రాక్టర్లు ఉన్నాయి. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేలు చెల్లిస్తేచాలు ఎన్ని ట్రిప్పులైనా తోలుకోవచ్చు. అంటే రోజుకు కప్పం రూ. 1.80 లక్షలు. ఐదేళ్ళలో రూ. 60 కోట్లకు పైగా వసూలు చేసుకునేశారు. ఇక తిరుపతి రూరల్‌లో 200 ఇసుక ట్రాక్టర్లున్నాయి. వీటి నుంచి తమ్ముడి గారి జేబులోకి రోజుకు రూ. 6 లక్షలు పడుతున్నాయి. లెక్కలు కడితే నెలకు రూ. 1.80 కోట్లు.. ఏడాదికి రూ. 21.60 కోట్లు.. ఐదేళ్లలో అన్నగారి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ్ముడు దోచుకుంది అక్షరాలా రూ. 108 కోట్లు. రెండు మండలాలూ కలిపితే చిన్నదొర అక్రమార్జన రూ. 160 కోట్ల పైమాటే! ఇది గాక చిన్నా చితకా నేతల దోపిడీ కూడా కలుపుకుంటే రెండు మండలాల్లో రూ. 500 కోట్ల విలువైన ఇసుక గల్లంతైంది.

కోటలో రూ. 210 కోట్ల ఇసుక మేసేశారు


కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాల జోరు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖిలో ఐదేళ్ళ నుంచీ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ 2022 ఫిబ్రవరి నుంచీ 2023 ఏప్రిల్ దాకా 14 నెలల పాటు ఇసుక దోపిడీ యధేచ్ఛగా కొనసాగింది. రోజుకు 80 టిప్పర్లు, 50 ట్రాక్టర్ల లోడ్ల ఇసుక నది నుంచీ వెలికి తీశారు. ఆ లెక్కన 14 నెలల కాలలో అక్రమంగా తరలించిన ఇసుక విలువ రూ. 210 కోట్లకు పైగా వుంటుందని అంచనా. అందులో సగానికి పైగా అధికార పార్టీ నేతల జేబుల్లోకి చేరిందని సమాచారం.

టిప్పర్లను పట్టించినా అధికారులు వదిలేశారు

గూడూరు నియోజకవర్గం కోట మండలం గూడలి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలతో విసిగిపోయిన గూడలి, దనుపాలెం, దక్షిణపాలెం, తిన్నెలపూడి గ్రామాల ప్రజలు 2023 ఫిబ్రవరిలో తవ్వకాలను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు రంగప్రవేశం చేసి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడితో తర్వాత వాటిని విడిచిపెట్టేశారు.


తొట్టంబేడు మండలం విరూపాక్షపురం వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాల ధాటికి తాగునీటి పైపు లైన్ బయటపడడంతో పాటు దెబ్బతిన్న దృశ్యం - ఏర్పేడు మండలం వికృతమాల వద్ద స్వర్ణముఖి నదిలో ఎంత లోతున ఇసుక తవ్వకాలు సాగించారనే దానికి నిదర్శనంగా గట్టుపై నిలిచిన చెట్టు

శ్రీకాళహస్తిలో రూ. 700 కోట్ల ఇసుక ఎత్తేశారు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కూడబలుక్కుని గత ఐదేళ్ళ వ్యవధిలో (కొవిడ్ ఏడాది తప్ప) సుమారు రూ.700 కోట్ల విలువైన ఇసుకను స్వర్ణముఖి నది నుంచీ ఎత్తేసినట్లు అంచనా. రేణిగుంట మండలంలో అధికారిక రీచ్‌లు లేవు. అయితే కొత్రమంగళం నుంచీ జీపాలెం దాకా పది కిలోమీటర్ల పొడవునా స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ మండలంలో 200 ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నాయి. ఒక ట్రాక్టరు రోజుకు ఏడు ట్రిప్పులు తిరుగుతుంది. ప్రతి ట్రాక్టర్ ఆపరేటర్ రోజుకు రూ. 3 వేల చొప్పున ముడుపులు చెల్లించాలి. ఆ లెక్కన నాలుగేళ్ళ వ్యవధిలో రూ. 80 కోట్లకు పైగా ముడుపులు చెల్లించారు. ఇక్కడ అధికారిక రీచ్‌లు లేకపోయినా ఓ కంపెనీ పేరు చెప్పుకుని దాని పేరిట రశీదులిస్తూ కొందరు ముడుపులు వసూలు చేస్తున్నారు. వారు ఉమ్మడి జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న ఓ బడా నేత ప్రతినిధులు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడొకరి కుమారుడు బడా నేత తరఫున వసూల్ రాజాగా వ్యవహరిస్తున్నారు. ఇక ఏర్పేడు మండలం పెనుమల్లం, పెనగడం, వికృతమాల, గోవిందవరం, మునగలపాలెం, కోబాక, కొత్త వీరాపురం, ముసలిపేడు, మడిబాక గ్రామాల వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గ ముఖ్యనేత సన్నిహిత బంధువు ఈ దందా వెనుక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక్కడి నుంచీ టిప్పర్లలో చెన్నైకి ఇసుకను తరలిస్తున్నారు. ఈ మండలం నుంచీ అధికారపార్టీ నాయకులే రూ. వంద కోట్ల వరకూ వెనకేసుకున్నారన్న ప్రచారం వుంది. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం, వేడాం, రామాపురం, చుక్కల నిడిగల్లు, పుల్లారెడ్డి కండ్రిగ, పట్టణ శివారులోని వాటర్ హౌస్ కాలనీ తదితర చోట్లా, అలాగే తొట్టంబేడు మండలం విరూపాక్షపురం, పెన్నలపాడు, చేమూరు, కనపర్తి తదితర చోట్లా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గం మొత్తంలో దోచుకున్న ఇసుకలో స్థానిక నేత వాటా దాదాపు రూ.250 కోట్లు అని అంచనా. మిగతా సొమ్ము జిల్లా పెద్దలు దబాయించి కొట్టేశారని అంటున్నారు.

రౌడీషీట్ తెరిచారు!

రేణిగుంట మండలంలో రీచ్‌లు లేకపోయినా తొలుత ట్రాక్టరుకు రోజుకు రూ. వెయ్యి వసూలు చేశారు కొందరు అధికార పార్టీ నాయకులు. అయితే 2022 ఏప్రిల్‌లో ఆ మొత్తాన్ని హఠాత్తుగా రూ. 3 వేలకు పెంచేశారు. దీంతో ఒళ్ళు మండిన ట్రాక్టర్ ఆపరేటర్లు అదే నెల 13న మూకుమ్మడిగా గాజులమండ్యం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనలో బడా నేత ప్రతినిధుల ఒత్తిడితో పోలీసులు ట్రాక్టర్ ఆపరేటర్ల ఆందోళనకు నాయకత్వం వహించిన వ్యక్తిపై రౌడీషీట్ తెరిచారు.

ఇసుక గోతిలో పడి ఇద్దరు మృతి

రేణిగుంట మండలం జీపాలెం గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు భారీ ఎత్తున జరగడంతో అంతేస్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. 2022 ఆగస్టులో ఇద్దరు యువకులు నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ ఓ గోతిలో పడి మృతి చెందారు.

ఏర్పేడులో ఏడుగురిపై ఎదురు కేసు

ఏర్పేడు మండలంలో వైసీపీ ప్రభుత్వం రాగానే ఇసుక అక్రమ దందా మొదలైంది. 2019 సెప్టెంబరులో పెనుమల్లం గ్రామం వద్ద ఇసుక అక్రమ రవాణాను స్థానిక టీడీపీ నేత నిరంజన్ నాయుడు అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు తిరిగి ఆయన మీదే కేసుపెట్టారు.

చిట్టమూరులో ఛిద్రం చేశారు!


చిట్టమూరు మండలం మెట్టు వద్ద నిబంధనలను ఉల్లంఘించి రెండు మూడు రెట్లు లోతుగా ఇసుక తవ్వేసిన తీరును స్కేల్ పెట్టి మరీ చూపుతున్న గ్రామస్తులు

గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిట్టమూరు మండలంలో అక్రమ ఇసుక తవ్వకాలతో స్వర్ణముఖి నది ఛిద్రమైంది. ఇక్కడ మెట్టు వద్ద అధికారిక రీచ్‌లో 13.85 ఎకరాల్లో తవ్వకాలకు జేపీ కంపెనీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ పరిధి దాటి తవ్వకాలు సాగించారు. మీటరు లోతుకి మించి తవ్వకూడదనే నిబంధన ఉన్నా 20 అడుగుల లోతు వరకూ తవ్వేశారు. రోజుకు సుమారు రూ. కోటి విలువైన ఇసుకను తరలించేశారు. ఆ లెక్కన 2023 జనవరి నుంచీ ఈ ఏడాది మార్చి వరకూ 15నెలల కాలంలో రూ. 450 కోట్ల విలువైన ఇసుక తవ్వి తీశారు. ఈ ఇసుకను స్థానికంగా విక్రయించకుండా చెన్నైకి తరలించి అధిక సొమ్ము చేసుకున్నారు. ఇష్టారాజ్యంగా జరిపిన ఈ తవ్వకాలతో మెట్టు వద్ద స్వర్ణముఖి నది భారీ గోతులతో అస్తవ్యస్తంగా తయారైంది.

పెళ్ళకూరులో 22 రోజుల్లో రూ. 20 కోట్లు స్వాహా

సూళ్ళూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కలవకూరు, పుల్లూరు, ముమ్మారెడ్డి గుంట, రావులపాడు, చిల్లకూరు గ్రామాల వద్ద స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వీరంతా స్థానికంగా విక్రయించేవారే. అయితే జయప్రకాష్ పవర్ వెంచర్స్ సంస్థ తాళ్వాయిపాడు వద్ద ఇసుక తవ్వకాలకు 2022 ఏప్రిల్‌లో అనుమతులు తెచ్చుకుంది. దీనిని గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడ తవ్వకాలు ఆపేసినా, అనుమతులులేని జీలపాటూరు-కప్పగుంట కండ్రిగ గ్రామాల నడుమ నదిలో తవ్వకాలు మొదలుపెట్టారు. రోడ్డుపై కాజ్‌వే నుంచీ మొదలుపెట్టి నదిలో కిలోమీటరు వరకూ తవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఇసుక తవ్వకాల కోసం ఏకంగా నదిలో అప్రోచ్ రోడ్డే నిర్మించేశారు. పలుసార్లు రెండు గ్రామాల రైతులు అడ్డుకున్నా పోలీసులు జోక్యం చేసుకుని గ్రామస్తులను వెళ్ళగొట్టారు. దీంతో విసిగిపోయిన జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్ రైతులతో కలసి హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేని చోట తవ్వకాలు జరపడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన హైకోర్టు తవ్వకాలు నిలిపివేయాల్సిందిగా ఆదేశించింది. ఈలోపు కేవలం 22 రోజుల వ్యవధిలోనే రూ. 20 కోట్లకు పైగా విలువైన ఇసుకను కొల్లగొట్టేశారు. రోజుకు 150 హెవీ టిప్పర్ లోడ్లు చెన్నైకి తరలించి సొమ్ము చేసుకున్నారు.

అన్నమేడులో నదిని కాపాడుకున్నారు

నాయుడుపేట మండలంలో తమకు అనుమతులు వున్నాయంటూ అన్నమేడు, మడపలం గ్రామాల వద్ద ఇసుక తవ్వకాలకు రంగంలోకి దిగిన (చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పే) ఓ మంత్రి అనుచరులకు రెండు గ్రామాల ప్రజలు చుక్కలు చూపించారు. స్థానిక సమస్య కావడంతో అధికార పార్టీ నాయకులతో సహా అన్ని పార్టీల వారూ ఒక్కటయ్యారు. మంత్రి అనుచరుల వాహనాలను కూడా గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. తమ ప్రాంత భూగర్భజలాల సంరక్షణకు ఉపయోగపడే స్వర్ణముఖి నదిలో ఇసుకను కాపాడుకున్నారు.


వాకాడు మండలం కాశీపురం, జాంబ్రపేటల వద్ద హై టెక్నాలజీ వినియోగించి నీరున్నా ఇసుక తోడుతున్న దృశ్యం

వాకాడులో నీళ్లలోంచి ఇసుక తోడారు

గూడూరు నియోజకవర్గం వాకాడు మండలం కాశీపురం, జాంబ్రపేటల వద్ద స్వర్ణముఖిలో ఇసుక తవ్వకాలు కొత్త ఒరవడి సృష్టించాయి. వెంకటగిరికి చెందిన వైసీపీ కీలక నేత చెన్నై నుంచీ పేరుమోసిన కాంట్రాక్టరును రంగంలోకి దించారు. ఆ కాంట్రాక్టరు రోజువారీ 50 లారీలు, 70 ట్రాక్టర్ల ఇసుకను చెన్నైకి తరలించారు. 2022 మార్చిలో మొదలైన అక్రమదందా అదే ఏడాది నవంబరు దాకా కొనసాగింది. ఆ నెలలో వర్షాలకు నదిలోకి నీరు చేరడంతో నెల పాటు పనులు ఆపేశారు. డిసెంబరులో నీరున్నప్పటికీ హై టెక్నాలజీ బోట్లు ఉపయోగించి 50 అడుగుల లోతు నుంచీ మోటర్లతో ఇసుకను వెలికి తీశారు. భూగర్భ జలాలు తగ్గుతున్నాయని ఆందోళనకు గురైన కొండాపురం, కాశీపురం, జాంబ్రపేట గ్రామాల రైతులు 2023 మార్చిలో ఇసుక తవ్వకాలను అడుకున్నారు. అప్పటికే సుమారు రూ.120 కోట్ల విలువైన ఇసుకను చెన్నైకి తరలించేశారు.

వాటాలేసి పంచుకున్న బడా నేతలు

జిల్లాలో గత ఐదేళ్ళుగా అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతున్న ఇసుక దోపిడీలో బడా నేతల ప్రమేయం వుంది. కడపకు చెందిన సీఎం సన్నిహిత బంధువు ఒకరు మొదలుకుని నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి దాకా పలువురు బలమైన నేతలు భారీగా లబ్ధి పొందినట్టు ప్రచారం జరిగింది. తవ్వకాలు జరిగే చోట, డంప్‌ల వద్ద, టిప్పర్లు, ట్రాక్టర్ల ఆపరేటర్ల వద్ద వసూళ్ళు చేసే చోట్ల వీరి సన్నిహిత అనుచరులు మకాం వేసి వుండడమే వారి ప్రమేయానికి నిదర్శనమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అక్రమార్జనలో వీరికి సింహభాగం పోనూ ఆయా నియోజకవర్గ ముఖ్యనేతలకు ఓ భాగం, తవ్వకాలు జరిగే మండల, గ్రామాల నేతలకు వారి వంతు వాటా దక్కుతున్నట్టు సమాచారం. మొత్తానికి ఎవరికీ సమాధానం చెప్పకుండా పోలీసు అండతో స్వర్ణముఖిలో ప్రకృతి ప్రసాదించిన ఇసుకను కొల్లగొట్టి అధికార పార్టీ నేతలు కోట్లకు పడగలెత్తిన వైనం జిల్లా ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.